# తికమక

" వెంకన్న గారూ ! నమస్కారం ! నాపేరు మురళి." ఓ అపరిచిత వ్యక్తి తన్ను తాను పరిచయం చేసుకున్నాడు.

సీట్లో కూర్చుని ఆఫీసు పని చేసుకుంటున్న వెంకన్న ఉలిక్కి పడ్డాడు. జుబ్బా - పైజామా - కోలమొహం - ముక్కు మీదకు జారుతున్న కళ్ళజోడు, పొడుగు పొట్టికాని - సన్నం లావుకాని ఓ మాదిరి అందమైన విగ్రహం అతనికి కనిపించింది. తలెత్తగానే.

" కూర్చోండి ! నా సీట్లో వర్కు పెండింగు ఉందా?" అడిగాడు.

అతను తల ఊపాడు అడ్డంగా - నిలువుగా.

" నాకు మీతోనే పని ఉంది - కొంచెం అలా క్యాంటీను వైపు కొస్తే మాట్లాడుకుందాం -" చెప్పాడు మురళి.

" సారీ ! నేను బిజీ రాలేను -"

" ఓ ఫైవ్ మినిట్సు - కొంచెం పర్సనల్ " ప్రాధేయపడ్డాడు.

వెంకన్న ఓ పది నిమిషాల తరువాత అతన్ని అనుసరించి ఆఫీసు క్యాంటీనుకు చేరుకున్నాడు.

రెండు కాఫీ ఆర్డరిచ్చాడు. " బాగా వేడీ - స్ట్రాంగ్ ఉండాలి!"

" చెప్పండి - నాకు బోల్డు వర్కుంది." కొంచెం చికాగ్గా అన్నాడు.

" ఏం లేదు ... మీరు సంబంధాలు చూస్తున్నారని తెల్సింది. మా కజిన్ ఉంది - మీకు ప్రపోజ్ చేద్దామని " నసిగాడు మురళి.

" నా గురించి మీకు ఎలా తెల్సింది?"

" అయ్యో! మోస్టు ఎలిజిబుల్ బ్యాచిలర్ ఉంటే తెలియకుండా ఉంటుందా? అదేం పెద్ద పని తెల్సుకోవడం - " మాటలతో దాటేశాడు.

" నాకండీషన్సు తెల్సుగా !" అనుమానంగా అడిగాడు.

" తెల్సుకోకుండా సాహసిస్తానా ?" పళ్ళుయికిలిస్తూ నవ్వాడు మురళి.

" ఇప్పటికీ చాలమంది నన్ను విసిగిస్తూ ఉంటారు పెండ్లి అన్నది వ్యక్తిగతం ప్రతిమనిషికి కొన్ని కోర్కెలుంటాయి. అది తెల్సుకోకుండా అదెందుకు ఇదెందుకు అని అడిగే వాళ్ళయితే నాకసహ్యం !" మొహం చిట్లించి చెప్పాడు.

" నాకు టైమైపోతున్నది - వెళ్ళాలి !" కాఫీ ముగించి చెప్పాడు.

అతను చేసుకోబోయే అమ్మాయి అందంగా ఉండాలి ! ఉద్యోగస్తురాలై ఉండాలి. చదువు సంస్కారం ఉండాలి. ధనవంతురాలు - గుణవంతురాలు అయిఉండాలి.

" అయ్యో ! ఒక్క నిమిషం. మరి మీకు ఎప్పుడు వీలవుతుందో చెబితే చూపులకు ఏర్పాటు చేస్తాను." వినయంగా అడిగాడు మురళి.

" ఎప్పుడైనా ఫర్వాలేదు - కాని నాకు జాతకం కూడ ముఖ్యం - ముందు అది ట్యాలీ కావాలి!"

" తప్పకుండా - ముందు తమరికి అమ్మాయి నచ్చితే - జాతకం పరిశీలిద్దురు గాని ..." చెప్పాడు.

" రివర్సు గేరా ! ఇప్పటి దాకా జాతకాలు నప్పితేనే సంబంధాలు చూశాను - జాతకం యిస్తే బాగుంటుంది. "

" ఇన్నాళ్ళు మీరు అలా చూశారుగా - ఈ ఒక్కసారికి యిలా చూడండి. ఏం లేదు - ఈ అమ్మాయి వేరే పనిమీద హైద్రాబాదు వచ్చింది. మళ్ళీ రేపు వెళ్ళి పోతుంది- జాతకం వాళ్ళ ఊర్లో ఉంది - పోగానే పంపిస్తాను." మురళి అభయం యిచ్చాడు.

" ఎప్పుడు చూడాలి ?"

" ఇవ్వాళ సాయంత్రం ముహూర్తం చాలా బాగుంది" చెప్పాడు.

తల ఊపాడు... ఆపైన మురళి కాగితం మీద ఏ బస్సు ఎక్కి రావల్సింది... ఎక్కడికి వస్తే తను రిసీవు చేసుకునేది అన్నీ రాసిచ్చాడు.

" ఎంత మంది వస్తారు?" అడిగాడు మురళి " మీ అమ్మగారు - నాన్నగారు

- అక్కచెల్లెళ్ళు ..."

" మా వాళ్ళు ఊళ్ళో లేరు - ముందు నేను వస్తాను మా ఫ్రెండును తోడుతీసుకుని - నాకు నచ్చితే, తర్వాత వాళ్ళ ఊరికే పోయి చూసొస్తాం!" చెప్పాడు.

సాయంత్రం ఏడు గంటలకల్లా వెంకన్న తన ఫ్రెండు సుబ్బన్నను తీసుకుని మురళి చెప్పినచోటికి వచ్చాడు. అప్పటికే మురళి వేచి ఉన్నాడు. ముగ్గురు కల్సి ఆటోలో అతని కజిన్ యిల్లు చేరుకున్నారు..

అది ఒక అపార్టుమెంటు, బాగా ఖరీదైంది. .

" కూర్చోండి - అయ్యో ! ఒకటి తీసుకురావడం మర్చిపోయాను. జస్టు ఫైవ్ మినిట్సులో వస్తాను - మీరు రిలాక్సుడుగా ఉండండి." అంటూ హడావిడిగా వెళ్ళిపోయాడు మురళి.

లోపలినుంచి ఓ యభై ఏళ్ళ వ్యక్తి బయటకు వచ్చాడు.

" నాపేరు బదరీనాథ్ - శోభకు చిన్నాయన వరుస అవుతాను" చెప్పాడు.

సుబ్బన్న, వెంకన్నల వంక మార్చి మార్చి చూశాడు. ఇద్దరూ కుర్రాళ్ళే - ఇద్దరూ అందగాళ్ళే ! వీరిలో పెళ్ళికొడుకు ఎవరో అర్థం కాలేదు. మురళి వచ్చి చెబితే గాని తెలియదు. అంతకు ముందు మురళి ఎవో చెప్పాడు కాని - తను అంత శ్రద్ధగా వినలేదు. బిజీగా వున్నప్పుడు చెప్పాడు.

" మీ యిల్లు బాగుంది. " సుబ్బన్న చెప్పాడు.

" టిఫిన్లు కూడా బాగుంటాయి..." బదరీనాథ్ చెప్పాడు. చప్పట్లు కొట్టాడు.

ఓ పనిపిల్ల ట్రేలో టిఫిన్లు పట్టుకొచ్చింది. రెండు స్వీట్లు - రెండురకాల కారాలు ... ఐస్‌క్రీములు .

" తీసుకోండి ... ఇంట్లో చేసే వాళ్ళు లేరు... పుల్లారెడ్డి స్వీట్‌స్టాల్ నుండి తెప్పించాను." బదరీనాథ్ చెప్పాడు.

" ఇప్పుడివన్నీ ఎందుకండి - అమ్మాయిని చూపిస్తే .." మొహమాటంతో చెప్పాడు వెంకన్న.

" మీరు తింటూ ఉండండి... ఈలోపు అమ్మాయి వస్తుంది.." అని చెప్పాడు

సుబ్బన్న ప్లేటు అందుకుని ఆబగా తినసాగాడు – నాజూగ్గా తింటున్నాడు వెంకన్న ...

ఈలోగా గాజుల గలగలలు – పట్టుచీర పరపరలు ... లోపలినుంచి ఓ అందమైన యువతి ట్రేలో జ్యూసు గ్లాసులు తెచ్చింది ... వాటిని వీరిద్దరి ముందువుంచి తను వారి ఎదురుగా కూర్చుంది...

ఆమె అందం ముందు వెంకన్న క్లీన్ బౌల్డు అయ్యాడు.

సుబ్బన్న కన్ను ఆర్పకుండా చూస్తున్నాడు... తిండం మర్చిపోయి..

" మీకేమన్నా అనుమానాలుంటే అడగండి !" బదరీనాథ్ చెప్పాడు.

" మీ పేరు తెల్సుకోవచ్చా?" సుబ్బన్న అడిగాడు.

" పేరుకూడ తెల్సుకోకుండానే చూడ్డానికి వచ్చారా?" శోభ అడిగింది.

వెంకన్న సుబ్బన్నను డొక్కలో పొడిచాడు.

" మీ నోటితో చెబితే విందామని.." సుబ్బన్న చెప్పాడు వంకరలు తిరుగుతూ

" శోభ – "

" శోభ ! చాలా బాగుంది !" సుబ్బన్న స్వీటు నోట్లో వేసుకుంటూ చెప్పాడు.

" ఏంటీ – స్వీటా ?" బదరీనాథ్ అడిగాడు.

" కాదు – స్వీటులాంటి మీ అమ్మాయి –" చెప్పాడు సుబ్బన్న.

బయటకు పోయిన మురళి ఇంకా రాలేదు – వెంకన్నకు ఆడగాలి తగిలితే తెగ సిగ్గుపడతాడు – నోట్లోంచి ఓ పట్టాన మాటరాదు. అనవసరంగా తను పిల్లిని చంకలో పెట్టుకొచ్చినట్లు సుబ్బన్నను పట్టుకొచ్చాడు – సమయానికి ఎవరూ దొరక్క – వీడు వాగుడుకాయ ! వాచాలుడు!

" అమ్మాయి ! బాగా చూడు పెండ్లి కొడుకును " బదరీనాథ్ చెప్పాడు.

శోభ సిగ్గు పడిపోయి తలవాల్చుకుంది. క్రీగంట చూస్తున్నది ఇద్దరిని ... ఇంతకూ పెండ్లికొడుకు ఎవరు?

"జ్యూసు చాలా బాగుంది..." చెప్పాడు సుబ్బన్న.

వెంకన్నకు కోపం వచ్చి – తన గ్లాసు జ్యూసు కూడా అతనికి వంపేశాడు. అది కూడ ఖాళీ చేసి " జ్యూసు చాలా బాగుంది..." అన్నాడు పళ్ళికిలిస్తూ సుబ్బన్న

బదరీనాథ్ లేచొచ్చి తన గ్లాసు అతనికిచ్చాడు సుబ్బన్న ఏమాత్రం మొహమాటం లేకుండా దాన్ని అందుకున్నాడు.

" అమ్మాయి ఏమన్నా అడుగుతుందేమో అడగమనండి –" సుబ్బన్న చెప్పాడు.

శోభ సిగ్గుపడుతున్నది..

బదరీనాథ్ అడిగాడు " ఇంతకూ ఏ ఉద్యోగం చేస్తారు?"

" అది తెలియకుండానే పిలిపించుకున్నారా?" సుబ్బన్న సందేహం...

" మళ్ళీ విందామని ...." చెప్పాడు..

"బ్యాంకులో పనిచేస్తున్నాం – ఇద్దరం కాబోయే ఆఫీసర్లం – ప్రమోషన్ లిస్టులో కూడా ఉన్నాం –" చెప్పాడు సుబ్బన్న...

" మురళి రాలేదు..." అతికష్టం మీద నోరు పెగల్చుకుని అడిగాడు వెంకన్న...

" వస్తాడు – కాని మనకి కావల్సింది అతను కాదు కదా – అమ్మాయి నచ్చాలి.. అబ్బాయి ఒప్పుకోవాలి...." బదరీనాథ్ చెప్పాడు.

" కరెక్టు .. కరెక్టు ..జ్యూసు ఎవరు కలిపారు" సుబ్బన్న అడిగాడు.

" నేనే కలిపాను – అంత బాగా నచ్చిందా?"

"ఆ ! జ్యూసు నైనా కాకపోతిని..." చిన్నగా హమ్ చేశాడు సుబ్బన్న.

శోభ కిల కిలా నవ్వింది.... ముత్యాల్లాంటి పళ్ళు బయటపడ్డాయి... ఆ నవ్వు శోభకు మరింత శోభను చేకూర్చింది.

" మా అమ్మాయికి కూడ పాటలొచ్చండి." చెప్పాడు బదరీనాథ్

"ఏదీ ఒకటి వినాలనుంది పాడండి చెవుల తుప్పు వదలాలి!" సుబ్బన్న చెప్పాడు.

" ఏది పాడమంటారు – "

" మీ కిష్టమైంది పాడండి ." చెప్పాడు సుబ్బన్న.

ఆమె వెంటనే అందుకుంది ' మనసున మనసై - తోడొకరుండిన అదే ప్రాణము అదే భాగ్యము ' అంటూ.

సుబ్బన్న శృతి కలిపాడు - వెంకన్న అతన్ని గిచ్చాడు- గిల్లాడు - కాని అతను ఈ లోకంలో లేడు.

పాట అయిపోయింతర్వాత తేరుకున్నాడు.

"ఆహా ! అద్భుతం .. 'మీరు పాడుతా తీయగా' ట్రై చేయలేదా?" అడిగాడు సుబ్బన్న.

" మీ సహకారం ఉంటే తప్పకుండా ప్రయత్నిస్తాను."

" ఈ సుబ్బన్న స్త్రీలకు ఎంతైనా సహాయం చేస్తాడు - నా జీవితాశయం అదే! ఏంటీ అక్కడేదో సిడీ ప్లేయరు లాగుంది - కొంచెం ఆన్ చేస్తారా ?" అడిగాడు సుబ్బన్న.

ఆమె వయ్యారంగా లేచి ఆన్ చేసింది. ఆ హంస నడకలను తన్మయత్వంతో చూస్తున్నాడు వెంకన్న.

ఇంతలో 'నెల్లూరి నెరజాణ' పాట సిడీలోంచి విన్పించింది. అంతే సుబ్బన్న పూనకం వచ్చినట్లు ఊగిపోతూ డాన్సు చేయడం మొదలెట్టాడు. ఆ ఉద్రేకంలో శోభ చేయి అందుకున్నాడు. ఆమెకూ ఏం హుషారొచ్చిందో తనూ చేయడం మొదలెట్టింది.

" మీ ఫ్రండు ఏంటి అలా ఉన్నాడు - డాన్సు రాదా?" అడిగింది.

" రేయ్ ! వెంకన్నా ! లేరా ! లేచి - మా లాగా గంతులెయ్యి ." అని అరిచాడు సుబ్బన్న.

" అరే ! మనం వచ్చిన పని ఏంటి - " అని వెంకన్న ఏదో చెప్పబోయాడు.

" నేవినను అంతే ! డాన్సు - మ్యూజిక్ నా లైఫ్ - స్టెప్పులు వెయ్యాలి - అదే జీవితం -" అంటూ ఊగిపోయాడు.

వెంకన్న లేచి నాలుగడుగులు వెయ్యబోయి జారికిందపడ్డాడు - బదరీనాథ్

వచ్చి లేవదీశాడు సిగ్గుతో కుర్చీలో కూర్చున్నాడు.

శోభ – సుబ్బన్న ఒకరి చెయ్యి ఒకరు పట్టుకుని నాట్యం చేస్తున్నారు – అనవసరంగా వీడ్ని తెచ్చానని బాధపడసాగాడు.

దేవుడు కరుణించి – కరెంటు కాస్తా పోయింది. సిడీ ఆగిపోయింది. సుబ్బన్న మామూలు మనిషి అయిపోయాడు. " అయ్యో ! ఇదేంటి నేను మీతో డాన్సు చేస్తున్నాను." బాధ పడ్డాడు వెంకన్న.

"డోంట్ వర్రీ – డాన్సు ఈజ్ మై హాబీ!" చెప్పింది కూర్చుంటూ.

" మీరు ఊ అంటే ముహూర్తాలు పెట్టేసుకుందాం !" బదరీనాథ్ చెప్పాడు అమ్మాయికి అబ్బాయి – అబ్బాయికి అమ్మాయి నచ్చిందనుకుంటూ.

" మురళి రానే లేదు – మధ్య వర్తి లేకుండా ఏం మాట్లాడాలి ?" బలవంతాన మాట్లాడాడు వెంకన్న.

" కట్నకానుకలు – మీ కేంలోటు చెయ్యరు మా వాళ్ళు – అదే నా మీ సందేహం..." బదరీనాథ్ అడిగాడు.

జాతకాలు – వగైరాలు – పెద్దలు వచ్చి చూడాలిగా – ఇవన్నీ అయింతర్వాత అప్పుడు –" నసిగాడు వెంకన్న.

" ఏం సార్ ! అవన్నీ కావాలా ఈ కాలంలో కూడా?" సుబ్బన్నను అడిగాడు బదరీనాథ్.

" ఛీ ! పాడు ! ఈ మోడ్రన్ ఏజ్‌లో కూడా మరీ యింత చాధస్తమా?" సన్నాయి నొక్కులు నొక్కింది శోభ – సుబ్బన్నను చూస్తూ...

" నో ! నో ! మా వాడుట్టి పాతకాలం మనిషి " చెప్పాడు సుబ్బన్న.

" మీరు మోడ్రనే కదా !" శోభ సన్నాయి పలుకు.

" ఓకే ! ఓకే ! నేను మోడ్రనే ! ఏంరా ఏం చేద్దాం?" సుబ్బన్న వెంకన్నను అడిగాడు.

" ఆమె ఏం చేస్తున్నదో కనుక్కోవాలిగా – " వెంకన్న నస.

" ఏమండీ మీ ఫ్రెండుకు తెగ అనుమానాలు – అమ్మాయి ఓ స్కూల్లో డాన్సు టీచరుగా పనిచేస్తున్నది– చాలా !" విసుగ్గా అన్నాడు బదరీనాథ్. " అయినా కందకు లేని దురద కత్తిపీటకెందుకట?"

" పెళ్ళంటే నూరేళ్ళ పంట కదండి... కాస్త ముందు వెనుక చూసుకోవాలిగా..." చెప్పాడు సుబ్బన్న.

" అంకుల్ ! నాకు ఓకే ! అతను ఓకే అయితే ప్రొసీడ్ అవుదాం – లేక పోతే డ్రాప్ చేద్దాం –" శోభ అంది టైం చూసుకుంటూ – " నాకు బయట ప్రోగ్రాం ఉంది వెళ్ళాలి!" కుర్చీలోంచి లేచింది.

" అమ్మాయికి సస్పెన్సు అస్సలు యిష్టముండదు. టెన్షన్ తట్టుకోలేదు ఏ సంగతీ చెప్పేస్తే – రేపు ఇంకా మూడు సంబంధాలు చూడాలి – ముందు చూసింది మీరు కాబట్టి ప్రిఫరెన్సు మీకు " చెప్పాడు బదరీనాథ్.

వెంకన్న సందిగ్ధంలో పడిపోయాడు.

సుబ్బన్న అతన్ని వరండాలోకి తీసుకు పోయాడు.

" రేయ్ ! ఒప్పుకోరా – బంగారపు బొమ్మ – నాట్యమయూరి. గానకోకిల – అపరంజి బొమ్మ– అప్సరస – మళ్ళీ దొరకదురా?" సుబ్బన్న.

"కానీ కట్నం ఎంతిస్తారో ఏమిటో – వీళ్ళ వంశ చరిత్ర తెలియకుండా – ముఖ్యంగా మా వాళ్ళకు చెప్పకుండా మాట ఎలా యిచ్చేదిరా?" వెంకన్న గాబరాగా అడిగాడు.

" అవకాశాలు అన్ని వేళలా రావురా – వచ్చినప్పుడు అందుకోవాలి... అయినా మీ వాళ్ళు యింత మంచి సంబంధం దొరికితే ఎందుకు కాదంటారు. ముందు నువ్వు ఓకే చెయ్యి – లేక పోతే యింకోళ్ళు తన్నుకు పోతారు." సుబ్బన్న హెచ్చరించాడు.

" సరే సుబ్బన్నా ! కాని ఒక్కషరతు – నువ్వు మటుకు మా ఆవిడతో డాన్సులు చేయడం – పాటలు పాడటం చేయకూడదు." షరతు పెట్టాడు.

" అయ్యో ! నాకేం పనిరా ! ఆ ఆవేశం అలా వచ్చింది – అంతే !" సుబ్బన్న

వెంకన్నను లోపలికి తీసుకొచ్చాడు.

" అయ్యా ! మా వాడికి మీ సంబంధం ఓకే !" చెప్పాడు సుబ్బన్న.

" సారీ !నాకు ఓకే కాదు – మీ పెళ్ళాన్ని మీరు సెలెక్టు చేసుకోవాలి కాని – మీ ఫ్రండు సెలెక్టు చేయడమేంటి?" శోభ సుబ్బన్నను చూస్తూ కోపంగా అడిగింది.

" శోభగారు – మా వాడికి మీరు పిచ్చ పిచ్చలుగా నచ్చేశారు – మీరు ఎప్పుడు చెబితే అప్పుడు మీ మెళ్లో మూడు ముళ్ళు వేస్తాడు" సుబ్బన్న చెప్పాడు.

శోభ నివ్వెర పోయింది – బదరీనాథ్ ఆశ్చర్యపోయాడు.

" అదేంటి పెళ్ళి నీకు కాదా?" సుబ్బన్నను అడిగాడు బదరీనాథ్ .

"నా బొంద నాకేంటి పెళ్ళి? ఓ గుండ్రాయిలాంటి పెళ్ళాం – ఇద్దరు ఏనుగుల్లాంటి పిల్లలు ఉంటేనూ?" జుత్తు పీక్కున్నాడు సుబ్బన్న

" సారీ ! నేను ఆయన అనుకో లేదు పెళ్ళి కొడుకు" శోభ చరచర లోపలికి పోయింది.

" ఇంక లేవండి – చేసిన నిర్వాకం చాలు వెళ్ళండి." బదరీనాథ్ కోపంగా చెప్పాడు.

వెంకన్న నివ్వెర పోయాడు! పెండ్లి చూపులకు వెళ్ళేప్పుడు సమవయస్కులను తీసుకు పోకూడదని, అథవా తోడు తీసుకుపోయినా– వెంట వచ్చేవాళ్ళు వరుడికంటే చలాకీగా – అందంగా ఉండకూడదని వెంకన్న పాఠం నేర్చుకున్నాడు.

( ఆదివారం ఆంధ్రభూమి 3-12-2006)